**కూ**కున్న పిల్లోడు కూకున్నట్టే ఉండాడు. అదు ముందుకీ జరగలా, యనక్కి బోలా, తీసీ పోలా, యనక మాల పందులు గుంపై జుత్తన్నై.

లెగవనోడు లెగవకపోతే లెగవక పొయ్యేడు, కదలకపోతే కదలకపొయ్యేడు. కంకర్రాళ్లు గుప్పిట బట్టి వొక్కటొక్కటీ ఆటి మూతి మీదా, ముట్టె మీదా, ముడ్డి మీద సురుక్కు సురుక్కు మనిపిత్తా గొడ తన్నాడు.

అయ్యటు గదిల్నా, యిటు గదిల్నా, అడుగెనక్కేయలా, పక్కకేయలా, ఆడే, అట్టాగే, అయివరా నరిసిమ్మ సాములో రికి మల్లె, రాళ్ళకి మల్లె. ఆడే మొలిసి నట్టు, కదల్లా. ఆటికి ఆకలి. ఈడికి ఆట. ఆకలి ముందు ఆటా గుద్దా? ఆగదు. ఆగలా. అంతే!

గున్నలు గునగున లాడతా వుంటే, సలు గులు గురగుర మంటుంటే, ఏనుగెల్లె ఉండీ పంది. ఎద్దెల్లె ఉండేది కొరకొరమంటూ, రాంబా ణంవల్లె ఉసీగా ఉరికొచ్చి పిల్లోణ్ణి ముట్టితో దొర్లిచ్చింది.

పందులన్నీ, ఆడట్టా దొర్లి పోంగానే, నెట్టుకొని తోసుకొని పోయి తింటన్నై. ఇగ సూసుకో నేలంతా సుప్తాగా సుబ్బ రం.

ముందుకు దొర్లిన పిల్లోడు మోకాళ్లను బిగదీత్తన్న సెడ్డీ ఊడబెరుక్కోలేక, అట్టాగే దొర్లి, బోర్లా గొట్టి, సెర్లో బడి, సేప్పిల్లల్లే యెగిరెగిరిపడి, ఒడ్డెక్కి, తడి సెడ్డీ దొడుక్కొని, 'నీ యక్కా, నీ యమ్మ, నీ యాలి, నీ యవ్వ' అన్దిట్టుకొంటూ పందుల్ని రాళ్లతో కొడతన్నాడు.


'పోరా! నువ్వేం జేసు! నీ రాళ్ళేం జేసు!' అనుకొంటున్నట్టు పందులు తీరిగ్గా యినోదంగా వొయ్యారంగా ఎళతా ఉండై. అడికింకా మండింది. అయ్యింకా పెల్లి నడకలు నడుత్తున్నై. ఆడికి తోడు పిల్లోళ్ళు పోగయ్యేరు. ఆ గోలకి కుక్కలు లగెత్తుకొచ్చేయి.

పందుల్ని పిల్లోళ్ళు రాళ్ళతో కొడ తంటే, కుక్కలు పళ్ళికిలిచ్చి ఆటినీ పీకా

# మెదడు వాపు

**ఆచార్య కొలకలూరి ఇనాక్**

ల్నని మీద బడతన్నై. రాళ్ళు ఆటికో లెక్కా? కుక్కలకి పందుల మెళ్ళూ దొర కలా, ఈపులూ దొరకలా, సివరికి కాళ్ళూ దొరకలా, తోకలూ దొరకలా, అరవటం దప్ప యేంది గురుత్తాయా కుక్కలు. పందుల గుంపు సెదిరింది. కుక్కలు తలో దిక్కుకు లగెత్తేయి. పిల్లోళ్ళేడబోయేరో, యట్టాబోయేరో గాని పందులు సుట్టు గూళ్ళలో దూరేయి. కుక్కలు లగెత్తి లగెత్తి ఆగి, యేదో పనుండట్టు యెటో పరంజేయి.



దేవళ్ళ సెరువు గట్టు ఊళ్ళోవోళ్లకీ, పల్లెలో వోళ్లకి పెద్ద దిక్కు. పొద్దు పొడవ కముందే ఆళ్ళ కడుపులు సుబ్బరం జేసి కడిగి పంపే తల్లి అది.

ఆ గట్టు పందుల ఆకలి తీరుసుద్ది. పందులే గాని లేపోతే అది పాయికానా అయిపొద్ది. మణిసటు బోలేడు, రాలేడు. అంత కంపు!

గొడ్డకాడి బుడ్డోళ్ళు సెర్లో గొడ్డుదోల లేరు. ఈతెయ్యలేరు. గొడ్డు నీళ్ళు దాగవు.

పందులు జీతం బత్తెం లేని పాకోళ్ళు. అయ్యిండబట్టే పల్లె పాకీ దొడ్డి కాకుండా బొయ్యింది. ఆట వొల్లే వూరు వూరల్లె ఉంటం!

పొద్దున్నే లేసి ఆటికి దణ్ణం బెట్టు కొంటే కంపు పోద్ది. పడంవటి గాలి సుబ్బరంగా వచ్చుద్ది. దచ్చాది గాలి సల్లంగా దోలుద్ది. కొంపల్లో కూడా కుమ్ముా ఉంటై. ఈళ్ళ తిండీ నీళ్ళూ ఉంటై. పందుల్లేకపోతే ఈ వూరు వూరా? పాయికానా కాదా?

పందుల్ని యేజళ్ళలో వడ్డోళ్ళు, కోడూర్లో యానాదొల్లు, సుద్దపెల్లిలో యరికలోళ్ళు బెంచుతారు. యేజళ్ళలో మాదిగె పెల్లిలో పక్కగా వడ్డోళ్ళ యిళ్ళుండై. అంతా పది గడప. ఆళ్ళ పదింటికొక పందుల సుట్టు గూడుంది.

''రాళ్ళ కూసాల మజ్జనుండే వాకిలి రాయి దియ్యంగానే తెల్లారుగట్టే పందులు పిల్లియ్యి, పెద్దియ్యి, ఆడియ్యి మొడియ్యి గునగునలాడతా యలపతి కొత్తై వచ్చీరాంగానే సెరువు గట్టుకురు కుతై. సెరువు గట్టు వొడ్డించిన ఇస్తర!

వడ్డోళ్ళు బాయి పూడిక దీత్తారు. సెరువు పూడిక దీత్తారు. బావులు దొవ్వు తారు. రోడ్డులేత్తారు గడ్డిరుత్తారు. గట్టులే త్తారు. గొడ్డు శాకిరీ జేత్తారు. మట్టి పన్లే గాదు, పొలం పన్లకీ బోతారు. యేం పన్నున్నా, యేం పన్ను జేసినా, చేయకపో యినా టంచనుగా పందుల్ని పెంచు తారు. పెంచటమంటే తెల్లారగట్ట ఆటిని సుట్టు గూటి నుంచి వదలటం, పొద్దోలే ముందు మల్లేసు రాటం, గూట్లో దోల టం అంతే! అయ్యే పుడతై, అయ్యే పెరు గుతై, సొమ్ము గావలిత్తే అమ్ముకోటం, ఆకలైతే కోసుకోటం. అంతే గానీ అయే ఆళ్ళకి పెద్ద అండ. ఆదరువు ఆస్తులు.

పంది ఈనితే పదీ పన్నెండు పిల్లలు బుడత్తై. ఆటిని తల్లి పులికి మల్లే పోరాడి పెంచుద్ది. పంది పిల్ల గుంపు నుంచి తప్పిపోతే కుక్కలు పట్టి, కరిసి, కొరికి సంపుత్తై, తిని సావ్వ, సంపి సత్తై.

తల్లి పందిని తాకీ దానికి కుక్కల తరమా? కుక్కలు సుట్టూ జేరి భౌభౌ మన్నా భొన్ భొన్ మన్నా. అది చెలిత్తే ఒట్టు! కదల్దు! కంగదు. యేనిగ యళతా వుంటే, కుక్కలరిసినట్లే! పంది పట్టపేనుక్కి మల్లే తోక ఇసినగ్రల్లే వూపుకుంటా పోతా ఉంటే దాని నడక అందం యే అంసలకి గుదురుద్ది!

పందుల పెంపకానికి పెద్దగా పెట్టుబడిలే. కరుసులే. సిందట దీసి దరిణి మీదేసే పనిలే. దమ్మిడీ మేతలే. వొందలూ వేలూ రాబడి. ఆటిని అందురూ సాకరు. రోత రొస్టు అసయ్యం. ఇష్టం గాదు.

పిల్లోళ్ళట్టా పందుల్ని పల్లెలోకి తరుం కొంటూ పోతా ఉండంగానే పెద్దోళ్ళట్టా పందులెమ్మట బడి లగూలు నీత్తన్నారు. యావయిందిరా ఆఁవటాని ఆళ్ళడుగుతుంటే, యాఁవయిందిరా ఆఁవటాని యిాల్లడుగుతా ఉండారు.

'యావయ్యిందేం దుంది?' అంటంటే 'వడ్డోళ్ళు కోసుకోటానికి పందిని పట్టుకొంటున్నారని తెలిసింది. దాని కోసమీళ్ళు లగెత్తుతుంటే, దేని కోసఁవో తెలీక అన్నీ 'సత్తిఁవిరా సినబాబా' అని ఉరుకెత్తుకుంటన్నై.'

'యియ్యాల పల్లెకీ, ఊరికీ పందికూర గేరంటి.'

కరకర పొద్దు పొడుత్తా వుంది. యండా కాలం పనుల్లేవు. రేత్రి గాలాడక, సిఁవట్లు బోసి నిద్దర బట్టక, దొర్లి దొర్లి, పొర్లి పొర్లి ఆరుబయట కాళ్ళు నిగడదోలి పొడుకున్నోళ్ళు, తెల్లారితే కూడా నిద్దర బోతున్నోళ్ళు ఆ అరుపులికి పెడబొబ్బలకి అటునుంచిటు దిరిగి మంచం కోళ్ళు వాటేసుకుని పొడుకునుండారు.

పంది కోసఁవ్ తరుంకొత్తన్నోళ్ళు పది మందేంది యింకా పైగానే ఉండారు. అయి ఉరికురికి అలిసి, అలుపు దీరుసుకుంటూ ముళ్ళ కంపలో ఉండాయి. ఉసీగా లగెత్తేవోళ్ళు గూడా ఆ ముళ్ళ కంపల్లో దూర్లేరు.

పొద్దు బొడవకముందు గానీ, రేత్తిరి పూట గానీ పల్లెలో వోళ్ళు సెరువు గట్టుకు బోతారు. పగటిపూట చెంబట్టుకు పొయ్యేవోళ్ళు ఆ కంపలోకి దూరిపొయ్యి మదుగ్గున్నసోట కూకుంటారు. ఆడికి పోయిన ఆటిని యఁవుడు గానీ, ఆడి కింక

**దొంగ**

**"ఇవాళ నా ఫ్రెండు అప్పారావు మనింటికి భోజనానికి వస్తున్నాడు. ఆ టేప్ రికార్డర్, గడియారం లోపల దాచెయ్" చెప్పాడు సుబ్బారావు, భార్య సుబ్బలక్ష్మితో.**

**"ఏం మీ ఫ్రెండుకు దొంగ బుద్ధి లెక్కువా?" అడిగింది సుబ్బలక్ష్మి.**

**"మరేం లేదు. తన వస్తువులు వాడు గుర్తు పట్టేస్తాడేమోనని."**



రోడు గానీ, సంపలేరు సరిగందా పొట్టు కోటం గూడా చాత గాదు. ఇంక వడ్డోలనగానెంత? ఆళ్ళకీ చాత గాదు. ఆటికి ఆడికి పొయ్యేది వచ్చేది కారు తార్రోడ్డు మీదొచ్చినట్టే.

కంపల్లో పొండుకొన్న పందుల్ని, దినాఁవు యలపలికి దోలుకొచ్చేది ఆళ్ళకి పిల్లాటె. అట్టా ఆళ్ళు ఆటిని పారదోలితే, ఈళ్ళు వొల బట్టుకొని కంప కంత కాడ కూకుని పొట్టుకుంటారు. అట్టాగే కూకుండారు. అవుసరం లేనాటిని బోనిచ్చి, అసల్ది రాంగానే వొలెత్తేరు ఆ పంది వొల్లో బడింది. అదొక్క గుంజు గుంజింది. ఆళ్ళిద్దరి సేతులొరుసుకుంటా, కోసుకుంటా వొల జారి పడ్డది.

వొలంటే జారుద్ది గానీ పందేడికి బోద్ది? వొల్లో సిక్కుకుంది. వొల సుట్టుకుంది. పంది దొర్లిన కొద్దీ వొల బిగుసుకుంది. అదింక లేవలేదు. మరిక పరిగెత్తేదేంది?

ఆళ్ళకి తొందర లేదు. వొల్లో ఉండపందిని వొల్లోనే ఉండనిచ్చి, ముందరకాళ్లు కలిపి, యనక్కాళ్ళు యనక జతచేసి ముడేసేరు. వొల సిక్కు దీసి, ఇడదీసి, పందినేరు జేసి, వొల లాగి మడతబెట్టి సంకబెట్టుకుండా డొకడు.

ఇద్దరు దాయెద్దుల్లాంటి మొగోళ్ళు ఒక నిట్టాడి దెచ్చి, యనక్కాళ్ళ సందులో దూరిసి, ముందు సందు లోంచి బయటికి దీసి, ఆడటు, ఈడిటు బుజాల మీద బెట్టుకొని మోసుకుబోతంటే, అదేలబడి, ఎగుర్లాడి, ఎగర్లేక. యల్లకిలబడి, తిక్కోడి యింటి కాడ బడేత్తే నేల మీద పొర్లు తానే ఉందది. అది తిక్కోడి పంది. తిక్కోడంటే తిక్కోడు గాడు. మంచోడే! అదాడి పేరు.

యనక్కాళ్ళ, ముంగాళ్ళ ముళ్ళు కలిపి మొగ్గట్టి నలుగురు పొట్టుకొని వుండారు. మెడకు దూముడేసిన తాడు ముందిద్దురు విడదీత్తా ఉండారు. తిక్కోడు బడితె దీస్కుని దానెదు రొమ్ముల మీద రొండు బాదులు బాదాడు. ఆగి మల్లీ బాదాడు. ఎగుర్లాడే పంది కదిల్తే ఒట్టు!

పంది మూతిక్కట్టిన తాడూడదీసేరు. కాళ్ళ తాడూడబీకేరు. పంది కదల్లా, మెదల్లా, కిక్కురుమంటే ఒట్టు.

తిక్కోడిల్లు ఈ మద్దెనే గప్పేరు. తాటాకు తుంటలుండాయి. ఆటిని దెచ్చి పందికటూ యిటూ బెట్టి ముట్టిచ్చేరు. మంట లేసింది. పంది బొచ్చు సురసుర మంటా కఁవిరింది. కఁవురు కంపు గొట్టింది. పందినటు దొర్లిచ్చి, యిటు దొర్లిచ్చి తుంటల మంటలతో సుట్టూ సుస్తాగా గాలిసీరు.

పని కత్తి దెచ్చి, గెడ్డం గీకినట్టు కాలి కఁవిరిన బొచ్చంతా నున్నగా గీకిసేడు తిక్కోడు. అది నల్లటి, సీకటింటా పందా? గీగ్గానే తెల్లంగా యర్రంగా పొద్దు పొడుపుకు మల్లె మెరిసి పోతా వుంది. సూడముచ్చటగా ఉంది. యెయ్యి కళ్ళు జాలవు దాని అందసందాలు సూడాల్నంటే. అంత సోగ్గా ఉందది. దొరసానికి మల్లే ఉంది. తెగ బలిసింది. కాలి ఉబ్బింది. సాప మీదేసి, కడిగి, తోఁవి, తుడిసి, పొడుకోబెడితే, సందఁవాఁవల్లే ఉంది.

పనికత్తితో ముడ్డి కాణ్ణించి, ముట్టె కాడి దాకా పగలగోత్తే, కాళ్లూ సేతులూ ఆరజాపుకొని పొడుకొన్న కాటా కుస్తీ వొస్తాదుకు మల్లే వుంది. లోపలున్న మురికి ముదనట్టం సుప్తాగా దీసి పెంట పోగులో బారేత్తే పంది సుబ్బరఁవైన వైనం సూసి తీరాల్సిందే గాని సెప్పనలివి గాదు.

పేతోలూడిపొయ్యి లోతోలు మెరుత్తా ఉంది. వారు యాడబట్టి సూసినా పిడికెడంత మందఁవుంది. బెత్తె డెత్తున కొవ్వు పేరుకుపోయింది. తిక్కోడి పందా? మజాకా?

మాఁసఁవూ, వారూ ముక్కలు గోసి ఈత సాప మీద కుప్పలేసీరు. చణాల్లో కుప్పలు మాయం. అరువు లేదు. బొడ్డు తిత్తిలో దుడ్డు. లెక్క జూసుకున్న తిక్కోడు బుర్ర దిరిగి. ఊపుకుంటూ యింటోకి బోయేడు.

(మిగతా వచ్చే వారం)

# మెదడు వాపు

**ఆచార్య కొలకలూరి ఇనాక్**

(గత సంచిక తరువాయి)

ఉప్పు కారంవ్ రాసిన వారు గాలిత్తే కొవ్వు గరిగి నూనె గారతావుంది. నోట్లో బెట్టుకొంటే నాలిక ఘుర్రుమంది.

ఆరగారగా వుప్పు వుప్పుమని వూదు కుంటూ కొరుక్కుతింటా వుంది, తిక్కోడి కూతురు. తింటన్న ఆనందం పట్టలేక పాట లంకిచ్చుకుంది. 'లింగూ లిటుక్కు, పది వారు పటుక్కూ' అంటూ పాడతా, బాయిగట్టు మీద బాచిపట్టు ఏసుకొని కూకుంది సిట్టి. పదేళ్ళ పసిది. దానికి గవును లేదు. లంగా సిరిగి మాసికలు బడి మాసి పోయుంది.

వడ్డోళ్ళది పది గడపా, ఆడా మగా అంతా సెంవటోడ్చే వోళ్ళే! ఆళ్ళని కాపాడేది బతికిచ్చేది పందులే! పండగలకీ, పబ్బాలకీ పందులే! పెళ్ళికి, సావుకీ పందులే! ఉంటానికీ తింటానికి దిక్కూ దివాణం పందులే! కరుసులికీ, సరుకులకీ, యిల్లు గడవటానికీ, పొయ్‌ల్లో పిల్లి లేవటానికీ పందులే! పందులే బందుగులు, కులపోళ్ళు అయినోళ్ళు! పందులే ఆళ్ళ దేముళ్ళు, దేవుతులు యిలు వేలుపులు.

ఆళ్ళ ఆడోళ్ళు, మొగోళ్ళు పిల్లోళ్ళు, ముసిలోళ్ళు అందరూ జాతర్లకీ, కొలువులకీ, తిరనాళ్ళకీ తాగేత్తారు. తందనాలాడేత్తారు. తైతెక్కలాడేత్తారు. తిట్టుకుంటారు. కొట్టుకుంటారు అంతలో అంతా కలిసిపోతారు. తాక్కపోతే ఆళ్ళు పెరమబత్తులు. తాగితే ఆళ్ళే పరమేస్సరులు. దేవాదిదేవుల్లు.

దేవుళ్ళు సెరువు. ఆళ్ళ తాత ముత్తాతలు తొవ్వేరు. వానొత్తే అది కిష్టానదే! ఆళ్ళ సెరువులో బుట్టిన సూరుడు, సింద్రుడు యెలు గు యెన్నెలయిత్తారు. సెరువులో నీళ్ళుంటే సెరువు గట్టు పచ్చగుంటది. అట్టుంటేనే పందులకి పండగ. పందులు బాగుంటే ఆళ్లు బాగుంటారు.

మాదిగె పిల్లోళ్ళని ఈళ్ళు అంటరానోళ్ళు అనరు. అన్నాసెల్లెలు, అమ్మానాయిన, అక్కాతమ్ముడు, అమ్మ, తాత అంటా కలిసి మెలిసి ఉంటా, తింటా కలుపుకొంటా, కలిసి పోతా ఉంటంతో ఆళ్ళెళ్ళో, ఈళ్ళాళ్ళో తెలియటంలా, యిళ్ళు గలిసినట్లే మణుసులు గలిసి పోయేరాళ్ళు.

గుంటూరు బోయిన పాలబండి తిరిగొత్తా, తుపాకులలో నలుగురు మునిసిపాలిటీ గోళ్ళనూ, ఇద్దరు పోలీసోళ్ళనూ, కంవీసనరునూ. బిళ్ళ బంట్రోతునూ మోసుకొచ్చింది.

అన్ని యిళ్ళలో ఉడికే పంది కూర వాసనకిమల్లే ఈళ్ళు రైలు దిగటంవూ పల్లెంతా గుప్పుంవంది. వడ్డోళ్ళలో ఉరకులు పరుగులు. గోల. ఏడుపు.

వడ్డోళ్ళకు నేస్తులుగా వుండే సావాసగోళ్ళుగా వుండే మాదిగోళ్లతోటే ఆ దోరంవు మంచి పందుల్ని పెంచోద్దు. పంది కూర తినొద్దు. పందులోల్ల మెదడు వాపు వత్తా వుండాంవటాని సాటింపు యేయిచ్చేరు. డప్పు గొట్టిచ్చేరు.

ఆం! వొట్టిదే! ఉత్తుత్తిదే తూనా బొద్దుంబాలు, ఆళ్ళు రారు. పందుల్ని పంపరు. ఈళ్ళిట్టా అనుకొంటా వుంటే ఆళ్ళట్టా రైలు దిగనే దిగేరు.

మాకు పందుల్లేవన్నారు వడ్డోళ్ళు, ఈళ్ళకు పందుల్లేవన్నారు మాదిగోళ్ళు. ఆళ్ళు తానా అన్నారు. ఈళ్ళు తందానా అన్నారు. ఆళ్ళు అరికతలు, బుర్రకతలు చెప్పేరు. ఈళ్ళు వంత బాడేరు.

పందు ల్లేవన్నారాళ్ళు. ఉంటయ్యి అనుకుంటున్నారీళ్ళు. యాడుండయ్యో దెలిత్తేగాని పని జరగదు. వడ్డోళ్ళ కిందరికీ గలిసి రొండొందల పందులుంటై. అయి యాడుం డై? సిల్లకంప, ముళ్ళకంప గుబుర్లో జేరి కూకుండై.

'ఆటిని సంపొద్దు దొరా! మా నోటి కాడి కూడు తియ్యొద్దు దొరా! మా నోళ్ళల్లో దుమ్ము కొట్టొద్దు దొరా! మా ఉసురు బోసుకోవొద్దు దొరా' అంటాంవటాని కంవీసనరు కాళ్ళాయేళ్ళా బడి యేడుకొంటా ఉండారు.

'మా వల్లేంవవుద్ది? మేంవేం జేత్తాం? మమ్ముల్నాళ్ళు సతాయిత్తన్నారు మాకట్టా ఆర్డర్లున్నై' అవా పెద్ద మనిసి యివరంగా జెప్పేడు.

'ఈళ్ళా ఇవరం తవరం లేనోళ్లు. ఆళ్ళా రూల్సు గీల్సు 'కీ, బే' అంటా ఇంగిలిపీసు గింగిలిపీసు దంచుతూ గొంతు జించుకొంటన్నారు.

జవ జచ్చినోళ్ళై కాళ్ళూ సేతులు సచ్చుబడ్డా వోళ్ళకు మల్లే వడ్డోళ్ళు కూలబడిపోయేరు.

కంవీసనరోళ్ళకి పందులు కనబళ్ళా.

'మేంవ్ జెప్పలా, మా వూళ్ళో పందుల్లే గిందుల్లే' మాదిగోళ్ళు జెప్పేరు.

'అట్టయితే మరీ మంచిదీ' కంవీసనరు నోట్లోంచి మాటా, హేటు లోంచి నవ్వు బయటికొచ్చి పల్లె ముకాన తుపుక్కునబడి పగిలిపోయేయి.

పదెకరాల మొయిన వొత్తుగా సిత్తుగా బెరిగిన సిల్లకుంప ముళ్ళకంప గుబుర్లోకి తొంగిసూసి, కంవీసనరుకు సూపిచ్చేడు, బిళ్ళ బంట్రోతు.

కంవీసనరు హేటు తీసేడు, కోటు తీసేడు వొంగేడు. తొంగేడు. దొంగ సూపు ల్జూసేడు. గుట్టలు గుట్టలుగా నల్లటి నీడలు-పందులు-గుంపులు-గుంపులు కనబడ్డై.

కంవీసనరు కంప కంత ముందు కుందు కూకుని 'పందులు. పందులే! కానీండి కా నీండి' అంటా అరుత్తుంటే వడ్డోళ్ళు సారు కాడికి సేరేరు.

'వొద్దు దొరా' అనేడుకుంటే, ఇన్లే. కాళ్లూ సేతులు పొట్టుకుంటే ఇన్లే. గెడ్డం బట్టి బెతిమాలుకుంటే ఇన్లే. సివరాకరికి పందిని గోత్తేవొచ్చిన దుడ్డును బొడ్డు తిత్తిలోంచి తీసిత్తే, ఇసిరికొట్టి 'లంచమిస్తావురా లమ్డీకె' అని నిట్టనిలువున యెగిరి, అంతెత్తు లేసి, ఆ మొయిన కూలబడి 'దాత్తేరి, దూత్తేరి' అని అలిసిపోయి, సెంవట్లు బోసి, 'తాత్, తూత్' అని 'కాల్చ' మనేసేడు.

అడ్డంవొచ్చి నోళ్ళని పోలీసోళ్ళు నెట్టేసేరు. తుపాకులోళ్ళు గురి గుదిరే సోట కాకుని కాలత్తానికి సందు జూత్తన్నారు.

## తాగుడు

పేరు పొందిన హాస్య కథారచయితను ఆయన ఆప్తమిత్రుడు అడిగాడు. నువ్వీమధ్య ఎక్కువగా తాగుతున్నావట నిజమేనా? అని అబ్బే అంతా అబద్ధం. నేను రెండురోజులు మాత్రమే మందు పుచ్చుకుంటాను. ఒకటి వర్షం వచ్చిన రోజున రెండు వర్షం రాని రోజున అన్నాడా హాస్యరచయిత.





కాలసొద్దు దొరా. పొట్టుకుపొండి. అమ్ముకోండి. ఆటిని జంపి, మమ్ముల్ని జంపొద్దు. అట్టయితే మమ్ముల్ని జంపండి. ఆటి నొదలండి' యేడుకొంటా ఉండారు.

కఁవీసనరు సావు కఁవీసనరుది. 'నువ్వేం జేతన్నావ్ ససుపెండు డిసిమిసు' అఁవటాని ఆడి పయ్యోళ్ళు ఆణ్ణి దులిపేత్తన్నారని ఈళ్ళ కెట్టా దెలుసుద్ది? ఎవుడి సావు ఆడిది. ఆడిసావు ఈడు సావడు. ఈడి సావు ఆడు జావడు. ఎవుడి సావు ఆడు జావాల్సిందే. ఎవుడేం జేత్తాడు?

పందులంటె సొమ్ము. ఇల్లు, వాకిలి. తిండి. బట్ట పెళ్ళీ పేరంటం. పందులంటే డబ్బూ దస్కం.

పందులంటే ఇండస్ట్రీ. పరిశ్రమ. వుత్పత్తి పంది పిల్లలు. పిల్లల పిల్లలు. పెట్టుబడీ కరుసూ లేని సరుకు.

ఆటిని జంపితే ఇండస్ట్రీ కూలిపోద్ది. పరిశ్రమ మూతబడుద్ది... సరుకుండదు.

ఆటిని జంపితే వడ్డోళ్ళ పది గడపా దిక్కూ మొక్కూ లేని అక్కుపచ్చులు.

ఆటిని సంపకపోతే పిల్లలికి మెదడు వాపు వచ్చుద్ది. సత్తారు. రేపటి మొగోళ్ళు ఆడోళ్ళు యియ్యాలే జత్తారు. పిల్లోళ్ళు జత్తే పెద్దోళ్ళు ఏడుత్తారు.

కఁవీసనరు ఉజ్జోగం బోద్ది.

మణుసు బుర్రల్లో పురుగులు జేరినట్టుండై. ఆళ్ళు తన్నుకు జత్తరు. బాంబులేసుకుంటారు. యుద్ధాలే యుద్ధాలు. సత్తారు. యుద్ధాలొద్దంటే, శాంతి గావాల్నంటే యేం జెయ్యాల? సావులికి కారణమైన మణుసుల్ని జంపాలా? సంపరు గందా! ఆళ్ళూ ఈళ్ళూ గలుత్తారు మాటలు గలుపుకుంటారు. మంచి చేత్తాఁవంటారు. వొప్పందాలు సేసుకుంటారు.

"పందుల్ని గాలిసినట్లు ఆళ్ళనీ కాల్చాలా? ఆళ్ళ నొదిలేసినట్లు పందుల్ని వదిలేయాలా?

పందుల వొల్ల సావులొత్తే మందులు సూసుకోవాలి గాని ఆటిని సంపటఁవేంటి?

పందులు వడ్డోళ్ళ ఆస్తిపాస్తులె గాదు. దేశ పాస్తి, దేశసంపద. దేశం డబ్బు.

పందులంటే తిండి. బువ్వ, కూడు. ఆటిని జంపి నోట దుమ్ము గొట్టుకుంటాఁవా?

ఆలోసించాల్సినోళ్ళకి, తలకాయలున్నాయని అనుకునేవోళ్ళకి మెదడు వాపు వొచ్చినట్టుంది. తప్పుడు మాటలు జెబుతుంటారు. తప్పుడు చాతల చరియల్కు చేపడతా వుం డారు.

తుపాకులోళ్ళు నాలుగు పక్కలా గురి జూత్తా కూకుండారు.

పందులన్నిటిని కాలిసి పారేత్తారని తేలింది. వడ్డోళ్ళకి వూపిరాట్టంలా. తిక్కోడిది దింపుడు గల్లాలాస. కఁవీసనరు ఆళ్ళేకుండా బోతే ఆళ్ళు కాలసరని ఆడికదోయిద. కఁవీసనరుని వాటేసుకున్నాడు. దూరంగా మోసుకుపోవాలని బుజానేసుకున్నాడు.

సూత్తా వూరికే ఉంటానికా పోలీసోళ్ళు గుంటూరు నుంచి కాళ్ళూ సేతులూ వూపుకుంటా వచ్చింది?

ఆళ్ళు తిక్కోణ్ణి ఉతికి ఆరేసేరు. ఆడలిసి అల్లాడిపొయ్యేడు. 'అంబే! అంబే!!' అంటా అరిసేడు. వడ్డోళ్ళంతా 'అంబే! అంబే!!' అంటా ఏడిసేరు.

అంబే అంటే రమ్మని కేక, చుట్టు గూడు సేరమని అరుపు, ఆపదొచ్చిందని గురుతు. పారిపొమ్మని ఎచ్చరిక. సావొచ్చిందని దండోరా.

మారుమోగుతున్న అంబేతో కంప చెట్లల్లో పందులు గునగునలాడిన్నై, గురగురలాడిన్నై, కొరకొరలాడిన్నై.

తుపాకులు 'టస్, టుస్, రప్, రరప్' మంటా మోతలు తెగ బెడతన్నై.

కఁవీసనరు కుందు గూకుని కంప కంతలోకి తొంగి సూత్తా. పందులు పడటం. లెగవటం. సెల్లాసెదురుకాటం కళ్ళారా జూసి, కడుపారా నవ్వుకొంటున్నాడు.

అయి అటు బోయేయి. ఇటు బోయేయి. అంతా తత్తరబిత్తర. సావుబొతుకులు. సచ్చే సావు. తప్పిచ్చుకొనే తోవ లేదు. దిక్కు లేని సావు.

యట్టా దప్పిచ్చుకుందో, యట్టా వచ్చిందో యెటు నుంచొచ్చిందో యెద్దంత పంది, యేనిగంత పంది, కఁవీసనరు యనకమాల కొచ్చింది.

సిక్కురొక్కురుగా, తీరూ తెన్నూ లేకుండా గుళ్ళకు దొరక్కుండా తప్పిచ్చుకొంటా పడతా లేత్తా ఉండా పందుల్ని కుందు గూకుని వంగి, తొంగి, ఓరగా సూత్తన్న కఁవీసనరు ఊపే ఊపు, ఉసారే ఉసారు!

తమ కూటి మీద కూకున్నట్టుగా ఉన్న కఁవీసనరుని, తమకు అంబే ఇనబడేట్టు సేసిన కఁవీసనరుని, యనకమాలగా వచ్చిన పంది ముడ్డి కింద ముట్టె బెట్టి యెత్తి యెగరేసింది.

తలకిందులుగా బడీ కఁవీసనరు ముళ్ళ కంప కుదురు కతుక్కుపోయేడు. పైన కాళ్ళు. కింద తల. ఊపి నిండా ముళ్ళు. మేకులతో గొట్టినట్టు సెట్టుకు కరుసుకు పోయేడు.

కాలుపులు ఆగాయి. బిళ్ళ బంట్రోతు సారును మేకులంటి ముళ్ళ నుంచి ఊడబీకేడు. పోలీసుల తోడొచ్చేరు. తుపాకులోళ్ళు సారును యెత్తుకొచ్చేరు.

సారు యీపంతా నెత్తురు. ముళ్ళు దిగి, ఇరిగి, తునిగి, ఊడి. ఊడక నెత్తురొత్తంటే కఁవీసనరు కళ్ళు దిరిగేయి. ఊపిరాట్టంలా. మిడిగుడ్ల సూపులు.

గుంటూరెల్లే రైలుకి గంట గొట్టేరు.

పందులు పత్తాలే.

వడ్డోళ్ళు అంబే అంటానే వుంటారు.

**అయిపోయింది**